



శ్రద్ధాబలంతో కొన్ని కథలు రక్తి కడ్తాయి. కథన కౌశలంతో కొన్ని కథలు 'సెభాష్' అనిపించుకొంటాయి. కథ, కథనం రెండూ ఒకదానితో ఒకటి పోటీ పడ్తే–బంగారానికి తావి అబ్బినట్లే! 'రాళ్ళెత్తినకూలీ' కథ ఈ కోవకు చెందుతుంది.

క్లుప్తత, గుప్తత సంతరించుకొన్న ఈ కథ మొండికేసి నిలబడకుండా చకచకా సాగిపోతుంది. దీన్నే చదివించే గుణమంటారు– ఈ కథకు ఈ గుణం కూడా అబ్బింది.

ఏ రచయితకైనా తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆవిష్కరించడానికి గుండె నిబ్బరం అవసరం. నిబ్బరమైన గుండె లోతుల్లోనుండి వెలువడే పలుకుల్లోనే స్పష్టత ఉంటుంది. ఈ కథలో ఆ స్పష్టత కనిపిస్తుంది.

సమస్యకు పరిష్కారాన్ని సూచించడమా? లేక సమస్యను నిష్పష్టంగా విశ్లేషించి చూపి ఆలోచింప చేయడమా? ఏది రచయిత బాధ్యత?అనిప్రశ్నిస్తే- ఆలోచనల్ని రేకెత్తించే వరకే తన బాధ్యత అని నా వ్యక్తిగత అభిప్రాయం. "రాజబాబు అప్పు చేసి సిగరెట్లు కాల్చేవయస్సులో తను కూలోడు– ఇప్పుడు ఆ బాబు మంత్రయినా తను ఇంకా కూలోడే!"–ఈ మాటలు–'ఈ వ్యవస్థ ఎందుకిట్లా కొనసాగుతూ ఉంది. పేదవాడు మరీ పేదవాడై పోతుంటే. మహారాజు రారాజులై పోతున్నారే। ఇదిట్లా కొనసాగవలసిందేనా? దీనికి పరిష్కార మార్గమేమీ లేదా?। అని ఆలోచింపచేస్తుంది. ఈ మాత్రం ఆలోచింపచేస్తే కథా ప్రయోజనం నేరవేరినట్లే।

"అక్కడాయనకు సిగరెట్లతోపాటు సీమ సరుకులోని నిషా, సింతపల్లి సిన్నదాని సుఖం కూడా బాగానే అలవాటయ్యాయి. తనలోని వేడిని రాజెయ్యడానికి ఆ మూడూ మూడు రాళ్ళపొయ్యిగా భావించినాడాయన. అందులో ఏ రాయిని తీసేసినా తన బతుకు భాండం నేల కొరిగిపోతుందని అతని భయం."

—ఈ వాక్యాలు రచయిత నిశిత పరిశీలనా దృష్టికి నిదర్శనాలు—

పునాదులు లేకపోతే భవంతులు లేవు. పేదవాళ్ళనే పునాది రాళ్ళమీద కలిగినవాళ్ళు కట్టుకొంటున్న మేడల్ని, వాళ్ళు మెడమీదపెంచుకొంటున్న కండల్ని ఎత్తి చూపే ఇది ఒక 'పునాదిరాయి'కధ.

....కథా సాహిత్యం అగ్గిపడిపోతున్న తరుణంలో ఈలాంటి కధలు సాహితీ ఎడారుల్లో ఒయాసిస్సులు!

—పులికంటి కృష్ణారెడ్డి.

బరువైన రెప్పల్ని మెల్లగా కదిల్చి గుడిసెలోంచి బయటకు చూశాడు అసిరయ్య. పొద్దున్నే కొండమీదకి వాలిన మబ్బులా పాకచుట్టూ చీకటి పరుచుకుని ఉంది. ఆపై అసిరయ్యకి చూపు ఆనలేదు. కాని దూరంగా ఏం జరుగుతూందో బాగానే తెలుసు.

ఆ ఆరంతస్తుల మేడని పెళ్ళికూతురులా ముస్తాబు చేస్తున్నారు. తెల్లారితే పెళ్ళిలా ఉందా సంబరం. వందలకొద్దీ జనం పనిచేస్తున్నారు. లక్షలు ఖర్చుపెట్టబోతున్నారు. ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతున్నా యక్కడ.

అయితే, ఆ పెళ్ళికూతురు పుట్టుక తనకు తెలుసు. సరిగ్గా తొమ్మిదినెలల క్రితం దాని మొదటి పునాదిరాయిని తనే మంత్రిగారికి అందించాడు. ఆ మంత్రిగారే మళ్ళీ వస్తున్నారట రేపు రిబ్బను కత్తిరించడానికి!

ఆయన అందరికీ మంత్రిగారే అయినా తనకి మాత్రం రాజబాబు గోరే! రాజబాబుని చిన్నప్పటినుంచీ తెలుసు. కాలేజీ చదువులు చదివి కలెక్టరవ్వాలని ఆయనగారి తండ్రి ఆశపడితే మొదటి మెట్టు ఎక్కలేక, నలుగురి నవ్వులూ చూసి భరించలేక ఇక చదవనని మొండి కేశాడు రాజబాబు. చేసేదిలేక కాంట్రాక్టు పను లప్పగించారు. రాజబాబుకి ఆయన తండ్రి.

అంతే తారాజువ్వలా లేచిపోయాడు రాజబాబు పనిలో. సిగరెట్లకీ సిన్మాలకీ తండ్రినడగలేక స్నేహితుల దగ్గర అప్పుల్జేసే రాజబాబు క్రమేణా డబ్బు వెనకేశాడు. గవర్నమెంటు కాంట్రాక్టులు తీసుకుని నాలుగేళ్ళలో నాలుగుచోట్ల ఇళ్ళుకట్టాడు సొంతానికి. నలుగుర్నీ పోగేసి, నాలుగు మాటలు చెప్పి తనచుట్టూ తిప్పుకున్నాడు. కొంతమందికి ఉపాధి

చూపించాడు. మరికొందరికి ఆశ చూపించాడు. స్నేహితులకు అతివల్నీ ఆనందాల్నీ చూపించాడు.వాళ్ళు చూపించిన ఆనందాన్ని కొనుక్కున్నాడు. కొనుక్కున్న ఆనందాల్ని తనివితీరా అనుభవించాడు అక్కడాయనకు సిగరెట్లతోపాటు సీమ సరుకులోని విషా, సింతపల్లి సిన్నదాని సుఖం కూడా బాగానే అలవాటయ్యాయి. తనలోని వేడిని రాజెయ్యడానికి ఆ మూడు మూడు రాళ్ళపొయ్యిగా భావించాడాయన. అందులో ఏ రాయి తీసేసినా తన బతుకు భాండం నేల కొరిగి పోతుందని అతని భయం. నమ్మకమూను.

ఆ సమయంలో రాజమండ్రి రాజావారమ్మాయి లక్షల ఆస్తి నెత్తి నెట్టుకుని వచ్చి రాజబాబుకి రాణి అయింది. రాజబాబువల్ల ఆమెకు దాంపత్య సుఖంతోపాటు ఆయన అంతకు ముందే వారకాంతలతో పంచుకున్న రోగాలుకూడా రాణిగారికి సంక్రమించాయి. రాజబాబు చేసే కాంట్రాక్టు పనులతో పాటు కంత్రీపనులుకూడా ఆమెకు తెలిసొచ్చాయి. సంతపల్లి సిన్నది రాజబాబు జీవితంలోంచి ఇంకా పోలేదని చింతించింది. దుఃఖపుకడవను నెత్తి నెట్టుకుని పుట్టింటికెళ్ళి గుమ్మంలోనే బద్దలు గొట్టింది.

అంతే! రాజబాబు సంసార జీవితం అంతటితో సరి.

పిల్లా పీచూ కలిగారో లేదో తెలీదు.

రాణిగారి కంటుకున్న రోగాలు నయమయ్యాయో లేవో తెలీదు.

రాజమండ్రి రాజావారు ఉన్నారో పోయారో కూడా తెలీదు.

రాజబాబు మాత్రం మళ్ళీ యథేచ్ఛగా స్నేహితులతో కలిసి సంతోషాన్ని కొనుక్కోవడం ప్రారంభించాడు.ధనం,కీర్తిఈరెండుదాహాలూ అతనిలో తీవ్రమయ్యాయి డబ్బుకోసం ఏ అన్యాయం చేయడానికైనా వెరవ కూడదనుకున్నాడు. 'ఎక్కడ అన్యాయ ముండునో అక్కడ వనలక్ష్మి, అదృష్టదేవతా ఉండునా?' అని ఆశ్చర్యపోయేట్లు ఒక పక్క

రాజుబాబు కట్టి ఇచ్చిన ఇళ్ళు కూలిపోతున్నా మరొక పక్క అతని గవర్నమెంటు కాంట్రాక్టులు వస్తూనే ఉన్నాయి. బాంకుల్లోనూ ఇనప్పెట్టెల్లోనూ డబ్బు నిండుతూనే ఉంది.

డబ్బు చేకూరాక పదవి, కీర్తి ప్రతిష్టలపై మోజు పెరిగింది. మెల్లగా కనకాన్ని పంచి పెట్టి కార్పొరేటర్ అయ్యాడు. అక్కడినుంచి పార్టీఫండు కూడబెట్టి ఆ టికెట్టుతోనూ, ప్రభుత్వ సారాయితోనూ ఎమ్మెల్యేఅయ్యాడు. ఆ తరవాత తనకంటూ ఒక ముఠాని ఏర్పాటుచేసుకుని ఎదురు తిరిగిన వాళ్ళని హతమార్చి మరీ మంత్రి అయ్యాడు.

రేపు రాబోయే మంత్రి ఆయనే. ఆరంతస్తుల గవర్నమెంటు బిల్డింగ్‌కి రాజబాబే రిబ్బను కత్తిరిస్తాడు.

అయితే రాజబాబు అప్పుచేసి సిగరెట్లు కాల్చే వయసులో తను కూలోడు. ఇప్పుడు ఆ బాబు మంత్రయినా తను ఇంకా కూలోడే.

అసిరయ్యను నీరసం ఆవహించేసింది. రెక్కాడితేనే కాని డొక్కాడని జీవితం తనది. ఇన్నాళ్ళూ శరీరకష్టంచేసి బతికాడు. తనమీద ఆధారపడ్డజీవాల్ని బతికించాడు. ఇప్పుడు .. సరిగ్గా నెలరోజుల క్రితం మట్టి పారబోస్తూ మూడో అంతస్తు పరంజాపై నించి జారి కింద పడ్డాడు. కుడికాలు విరిగింది. కొన్నాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాడు. ఆ తరవాత ఉండలేక వచ్చేశాడు. ఆస్పత్రిలో మందు లుండకపోయినా అక్కడి గోడలు కూడా చేతులు చాస్తాయి కదా! మంచాలుండక పోయినా ఉన్న మంచాలకి అద్దె లుంటాయి కదా! అందుచేత వచ్చేశాడు.బతికుంటే చాలునని బయట పడ్డాడు.

ముక్కు పచ్చలారని మనుమడే తనకు దిక్కయ్యాడు.

కాని ఉన్నట్టుండి మా కాని చిక్కొచ్చి పడింది.

బిల్డింగు కట్టడం పూర్తవడంతో అక్కడి పాకలు తీసేయమన్నారు. సంవత్సరం క్రితం కూలీలంతా వేసుకున్న పాకలవి. సుమారు

పాతికుంటాయి. ఎవరిమట్టుకు వారు మరో పని చూసుకుని పోవాల్సిందే. కొంపా గోడుతోసహా. మరీ ఏ అధారమూ, ఆశాలేని తన దారేంటి? కాస్త కాలు కూడనీయండయ్యా పోతూనంటే కుదర్దు పొమ్మంటున్నారు.

అవును మరి. అది మేడంటే మేడా? ఆరంతస్తుల భవనం. ఒక్కొ అంతస్తులో పాతికేసి గదులు, వరండాలు, బాత్రూంలు, కొళాయిలు, అద్దాలూ, సింకులూ, బిల్డింగుకు ముందు, వెనక అందమైన మొక్కలు. అలా పెళ్ళికూతుర్లా మెరిసిపోయే మేడచుట్టూ తమ పాకలుదిష్టిపిడతలా... అందుచేత తీసెయ్యమన్నారు. కాలుకాస్త గట్టిపడితే ఎక్కడో దగ్గర వేసుకుంటాడు కానీ జీవనోపాదో!

రేపొచ్చే మంత్రిబాబు దగ్గర తను కూలీగా పనిచేశాడు. ఆయ నంతోడైతే తనిలాగే ఉండిపోయాడు. ఇంకా .... భూమి కంటుకు పోతున్నాడు.

అందుచేత. అడగాలి! ఆ బాబునే అడగాలి— మాట సాయం చేయమని అనుకున్నాడు అసిరయ్య.

తెల్లారింది.

బిలబిల్లాడుతూ మేడచుట్టూ జనం—పచ్చ పచ్చని తోరణాలతో కలకల్లాడిపోతూంది. ఎక్కడ చూసినా జనం. జనం. మనిమడి నాసరా చేసుకుని వచ్చి ఒక మూలగా నిలుచున్నాడు అసిరయ్య. రాజబాబు ఆ దారంటే లోపలికెళ్ళాలి— సరిగ్గా అప్పుడు ఆయన దృష్టిలో పడాలి. దండాలెట్టాలి. అనక తన కత చెప్పాలి. అది అసిరయ్య ఆశ.

పుష్పకం లాంటి కారు రానే వచ్చింది.

అందులోంచి దిగిన రాజుబాబు రాజాలా ఉన్నాడు. ఎత్తుకు తగ్గ ఒత్తూ....ఖదరు లాల్చీ, టోపీ—బంగారం ఫ్రేము కళ్ళద్దాలు. రంగుదేలి ఎర్రగా జాంపండులా ఉన్నాడు. మెత్తగా పరిచిన తివాచీ మీద మెత్త మెత్తగా అడుగు లేసుకుంటూ వచ్చాడు. చుట్టూ మందీ మార్బలం. పోలీసులూ, ఆఫీసర్లూ.

రాజుబాబు అట్టే చదువు కోకపోతేనేం? ఎంతెంతో చదువుకున్న బాబులు ఆయన చుట్టూను. మనమడు చెయ్యి పట్టుకుని ముందుకు రాబోయాడు అసిరయ్య. రాజుబాబు తనకు స్పష్టంగా కనిపిస్తున్నాడు. రెండు గజాల దూర మంటుంది. ఆయన నవ్వుతూ అందరివంకా చూస్తూదండాలు పెడుతున్నాడు అసిరయ్యకుకూడా ఆనంద మనిపించింది. చేతిలో వూత కర్ర ఉన్నా చెయ్యెత్తి దండం పెట్టేడు. కానీ అడుగుముందు కేసిందుకే వీలులేని పరిస్థితి ఏర్పడింది. అప్పటికే పోలీసులు జనాన్నితోసేస్తున్నారు. ఆ తోపుకు పడబోయి నిలదొక్కుకున్నాడు అసిరయ్య. కానీ అంతలోనే రాజుబాబు అంతర్ధానమై పోయాడు. రిబ్బను కత్తిరించి లోపలికెళ్ళి పోయాడు.

అసిరయ్యకి అక్కడనుండి కదలబుద్ధి కాలేదు. రాజుబాబు మళ్ళీ తిరిగి రావాలి. తను తన గోడు చెప్పుకోవాలి. అప్పుడు కదలాలి.

జనం చెల్లాచెదరయ్యారు. పావుగంటలో తిరుగు ముఖం పట్టారు మంత్రిగారు. ఈ మారు ట్టే జనం లేరాయన చుట్టూ. అసిరయ్య మెల్లగా ద్వారం దగ్గరకు కుంటూకుంటూ వెళ్ళాడు. రాజుబాబును చూసి నవ్వి, 'దండలయ్యా' అన్నాడు.

రాజుబాబు తల విదిల్చాడు సమాధానంగా.

"గుర్తున్నానా, బాబూ?" అసిరయ్య గొంతు వణికింది.

"ఎవరూ?" భృకుటి ముడిచారు మంత్రిగారు.

"అసిరయ్యని బాబూ" అంటూ చేతులు నలుపుకున్నాడు. రాజుబాబు పెద్దొడై పోయాడు. తనలాంటి కూలీల్నేం గుర్తుంచుకుంటాడు?

"అలాగా! ఏమిటి సంగతి?" అడిగాడాయన.

"ఏముంది, బాబూ! ఈ మేడకి పునాదేసినప్పుడు పునాదిరాయిని

నేనే అందించాను తమకి—ఇప్పుడీ ఆపదొచ్చి కాలిరిగి కూలి లేనోణ్ణయ్యాను. తమరేదన్నా దయ తలిచి....

ఆపై మాట గొంతులోనే ఉండిపోయింది.

“మరా కంట్రాక్టర్ని అడగలేక పోయావా? అయినా కాగితం రాసి పెట్టుకో. వృద్ధాప్యపు పింఛను ఏదో—చూద్దాం” అంటూ కదిలి పోయాడాయన.

అసిరయ్యకేం అర్థం కాలేదు.

కాంట్రాక్టర్ల వల్లా, కాగితాలవల్లా, ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్ల వల్లా తన బతుకు బాగుపడే దెప్పుడు?

అసిరయ్య నిజంగానే భూమి కంటుకుపోయాడు.

( ఆంధ్రప్రభ 11-7-1984 )

5)